# సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి

# కా॥ కోవై ఈశ్వరన్ మొదటి వర్ధంతి సభ

**చెన్నై, 1-7-18:**

సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు రాష్ట్రకమిటి కార్యదర్శి కా॥కోవై ఈశ్వరన్ మొదటి వర్ధంతిసభ చెన్నైలోని సిఐటినగర్‌లో జులై 1వ తేదీన జరిగింది.

పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటి నుండి **కామ్రేడ్ గుణలన్** ఈ సభకు అధ్యక్షత వహించారు. కామ్రేడ్ ఈశ్వరన్ మరణం తమిళనాడులో పార్టీ నిర్మాణానికి తీరనిలోటని ఆయన పేర్కొన్నాడు. కామ్రేడ్ ఈశ్వరన్ అసంపూర్తిగా వదలివెళ్ళిన కర్తవ్యాల పరిపూర్తికి నడుం బిగించాలని కోరారు. కామ్రేడ్ ఈశ్వరన్ కుటుంబానికి అన్నివేళలా అండగా నిలవాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. తొలుత సభకు హాజరైన వక్తలు, విప్లవశ్రేణులు, బంధుమిత్రులు కా॥ ఈశ్వరన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రజాకళాకారుల, సాహిత్యవేదిక(ఎమ్‌కెఇకె)గాయకులు అమరులను స్మరిస్తూ విప్లవగేయాలు ఆలపించారు.

కామ్రేడ్ ఈశ్వరన్‌తో కలిసి పనిచేసిన రోజులను **కా॥కొచ్చాడయ్** గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ కార్పొరేటు దోపిడీకి, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచి, సంఘటితంచేసి, పోరాటాల్లోకి కదిలించాల్సిన అవసరాన్ని **కా॥శివకుమార్** నొక్కి చెప్పారు. **సీనియర్ అడ్వకేట్ శంకరసుబ్బు** మాట్లాడుతూ నగ్జల్బరీ కామ్రేడ్స్ కొందరికి ఉరిశిక్ష విధించటాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాపోరహక్కుల సంస్థ ఆధ్వర్యంలో ఈశ్వరన్‌తో కలిసి నిర్వహించిన పోరాటాన్ని ఆయన జ్ఞప్తికి తెచ్చుకున్నారు. రాజకీయ, వ్యక్తిగత జీవితంలోని కా॥ఈశ్వరన్ ఆదర్శనీయ లక్షణాలను గురించి **ప్రొఫెసర్ గంగాధరన్, అడ్వకేట్ మనోహరన్**లు వివరంగా మాట్లాడారు. **తమిళ్ నేషనల్ లిబరేషన్ మూవ్‌మెంట్ నాయకులు కా॥త్యాగు** మాట్లాడుతూ పాలకవర్గ పార్టీలతో ఐక్య కార్యాచరణ సరికాదని, ఎందుకంటే వారు అధికారంలో వుండగా అవే విధానాలను అనుసరించుతారని అన్నారు. **ఎమ్‌కెఇకె ప్రతినిధి కా॥వీరాసామి** మాట్లాడుతూ కామ్రేడ్ త్యాగు హెచ్చరికలను ఖచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. **సిపిఐ(ఎం) నాయకులు కా॥వీరరాఘవన్** మాట్లాడుతూ తామిరువురమూ వేరువేరు పార్టీలకు చెందినప్పటికీ ఆ ప్రాంత ప్రజాసమస్యలపై పరస్పరం చర్చించుకునే వారమన్నారు. **కా॥సుందర వినయగం** కా॥ఈశ్వరన్ ఆచరించి చూపిన రాజకీయాలను, పార్టీ విధానాలను ముందుకు తీసుకువెళ్ళటం ఆయనకు నిజమైన నివాళిగా పేర్కొన్నారు. కామ్రేడ్ ఈశ్వరన్ కుమార్తె **కా॥ప్రియ** మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులందరూ తమ తండ్రి అడుగుజాడల్లో విప్లవోద్యమ కృషిలో పాలుపంచుకుంటామని చెప్పారు.

**'క్లాస్‌స్ట్రగుల్' సంపాదకులు కా॥పి.జస్వంతరావు,** కా॥ఈశ్వరన్‌తో తన అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. దేశంలో రాజకీయ పరిస్థితుల గురించి ప్రస్తావిస్తూ హిందూమతతత్వశక్తులు మైనారిటీ మతస్థులపై ప్రత్యేకించి ముస్లిములపై ఫాశిస్టు తరహా దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉనికిలోవున్న దోపిడీవ్యవస్థను రద్దుచేసే పోరాటంలోకి ప్రజాసమూహాలను సంఘటితపరచటమే కా॥ఈశ్వరన్‌కు తగిన నివాళి అని పేర్కొన్నారు.

**సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కా॥సుశీలన్** మాట్లాడుతూ కష్టించే తత్వం, అంకితభావం వంటి అత్యుత్తమ కమ్యూనిస్టు లక్షణాలను మనమంతా స్వీకరించాలన్నారు. కా॥ఈశ్వరన్ మనమరాలు **అనూరాధ** తమ తాతగారి ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్తామన్నారు. కామ్రేడ్ ఈశ్వరన్‌కు జోహార్లర్పిస్తూ వర్ధంతి సభ స్ఫూర్తిదాయకంగా ముగిసింది.

ooooo